క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ


సీఐ రమాకాంత్

మణుగూరు రూరల్ : పట్టణంలోని మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ఎ.రమాకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ప్రాధాన్యతనిస్తూ, శాంతిభద్రతలను పరిరక్షిస్తానన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన, నిబంధనలను అతిక్రమించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు సీఐను పట్టణ ప్రముఖులు, నాయకులు, స్వచ్ఛంద సంస్థల వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కవితను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: టీబీజీకేఎస్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, నాగెల్లి వెంకటేలు శుక్రవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వీ.ప్రభాకర్‌రావు నాయకత్వంలో ఏరియా బలమైన శక్తిగా ఉందని వివరించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర నాయకులు వెంకట్రావ్, మిర్యాల రాజిరెడ్డి, కెంగర్ల మల్లయ్య, కోల్‌బెల్ట్ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడిగా వసీంపాషా


వసీంపాషా

చంద్రుగొండ : మండలకేంద్రానికి చెందిన వసీంపాషాను ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడిగా నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నియామకపు లేఖ విడుదల చేశారు.
ఈ సందర్భంగా శుక్రవారం వసీం మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానన్నారు.

వైద్యశిబిరం


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చంద్రుగొండ : మండలంలోని సీతాయిగూడెం గ్రామంలో ఎర్రగుంట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేసి, వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక, సిబ్బంది సుశీల, భవాని, విస్తర్‌రాణి, కృష్ణయ్య, నాగేశ్వరరావు, రాందాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అశ్వాపురం: మండలపరిధిలోని అంబేడ్కర్‌నగర్ గ్రామానికి చెందిన ఇరుగు పున్నయ్య కడుపు నొప్పి, కిడ్నీ సమస్యతో బాధపడుతుండగా గౌతమీ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పున్నయ్య వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు కే.సోమయ్య, ఈ.నారాయణరాజు పాల్గొన్నారు.
మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన మేకల నాగమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించి మండల మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రూ.6,500 ఆర్థికసాయం అందజేశారు. సంఘం అధ్యక్షుడు కమటం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కాసరబాద రాములు, యువజన సంఘం అధ్యక్షుడు పర్వత నరేష్, నాయకులు కోసూరి రాములు, తోట వేణు, శ్రీను, కమటం నరేష్, జంగిలి భాస్కర్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలనకు పోరాడాలి

అశ్వాపురం: సమానత్వ భావానికి ఆటంకంగా ఉన్న కులాన్ని సమూలంగా నిర్మూలించేందుకు పోరాటాలు సాగించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎం.గిరి అన్నారు. సత్యశోధక్ సమాజ్ 150వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం కుల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నాగేశ్వరరావు, పెదగోని ఆదిలక్ష్మి సున్నం భూలక్ష్మి, జక్కం కొండలరావు, ఎల్.రవి, మంజుల, సాంబ, ప్రణయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు..!

ట్రాఫిక్ నియమాలను గాలికొదిలేస్తున్న వాహనదారులు

- అవగాహన సదస్సులు నిర్వహించినా ఫలితం శూన్యం
- ఈ-చలాన్లు విధిస్తున్న పోలీసులు
- నెల రోజుల్లోనే 4వేల కేసులు..
- రూ.6 లక్షల వరకు చలాన్ల పెండింగ్


ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. ఆర్టీఏ, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటిస్తూ.. అధికారులకు సహకరించాలని సంబంధిత అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించినా ప్రయోజనం లేకుండాపోతోంది. భద్రాచలం పట్టణం పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై ట్రాఫిక్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపడుతూ ఈ చలాన్లు (జరిమానా) విధిస్తున్నారు. పట్టణంలోని ప్రధాన ఏరియాలతోపాటు ప్రధానకూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులు ప్రతీరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు వందలాది ఈ-చలాన్లు విధిస్తున్నారంటే వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ ఏ మేరకు బ్రేక్ చేస్తున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.

ఉల్లంఘించిన వారిపై చర్యలు..

పట్టణంలో ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నడుపుతున్న వాహనదారులపై ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాస్ కేసులు నమోదు చేసి, ఆ వాహనాలను సీజ్ చేస్తున్నారు. ఇదే క్రమంలో మొదటి సారి పట్టుబడిన వారికి ఫైన్ వేసి, నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించి తనిఖీ చేస్తున్న క్రమంలో మరలా పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేసి, వాహనదారులపై కేసులు నమోదు చేస్తున్నారు. గడిచిన నెల రోజుల్లో అధికసంఖ్యలో వాహనాలు సీజ్ చేసి, వాహనదారులపై కేసులు నమోదు చేశారు. జులై 25 నుంచి ఆగస్టు 28 వరకు పట్టణంలో ట్రాఫిక్ పోలీసులు వివిధ రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి దాదాపు 4,173 కేసులు నమోదు కాగా ఇందుకు సంబంధించి రూ.6 లక్షల 22 వేలు ఫైన్ విధించారు. అదేవిధంగా వాహన నంబర్లు కనిపించకుండా చేస్తున్న వాహనదారులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఈ మేరకు ఇదివరకు పట్టణంలో పలు కేసులు నమోదుకాగా ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి అవగాహన కల్పిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వేడుకోలు

పట్టణంలో పలు కూడళ్లలో వ్యాపార నిమిత్తం రోడ్డుపైకి తమ వ్యాపార సంబంధిత వస్తువులు పెట్టడం, లేదా వాహనాలు అక్కడే గంటల కొద్ది నిలిపడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉంటుందని వాహనదారులకు, ప్రజలకు అంటున్నారు. వారిని నివారించే విధంగా పోలీసులు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా పట్టణంలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పనిసరిగా ప్రజలు పాటించే విధంగా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అంటున్నారు.


బైక్‌పై వెళ్తున్న ముగ్గురు..(ఫైల్)

నిబంధనలు పాటించాలి



దేశ పురోగతిలో కీలకభూమిక పోషించే యువత, చిన్నచిన్న తప్పిదాల వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరం. ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ, కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ ధరించాలి. ప్రతీ వాహనదారుడు తమ వెంట హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ పేపర్లు ఉంచుకోవాలి.

– పరితోష్ పంకజ్, భద్రాచలం ఏఎస్పీ

అవగాహన కల్పిస్తున్నాం



ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నిబంధనలు పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు. పెండింగ్‌లో ఉన్న చలాన్లను చెల్లించాలని సూచిస్తున్నాం. నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలు సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్, భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై

కాంగ్రెస్‌తోనే ప్రజలకు మేలు


మణుగూరు టౌన్: కరపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు


కరకగూడెం: రేగుళ్లలో..

మణుగూరు టౌన్: అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసి, ఇచ్చిన హామీలు నెరవేర్చి పేదలకు అండగా నిలిచే సత్తా కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మణుగూరులోని గ్రామాల్లో గడపగడపకూ పాదయాత్ర నిర్వహించి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కేవిరావు, ఉపసర్పంచులు పుచ్చకాయల శంకర్, గోరంట్ల కనకయ్య, బాజీ, వెంకట్రావ్ గౌడ్, మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కొమరం రామ్మూర్తి, సుబ్బారెడ్డి, సాంబశివరావు, మహేశ్, నగేశ్ తదితరులు ఉన్నారు.

కరకగూడెం: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ పినపాక నియోజకవర్గ కన్వీనర్, టీపీసీసీ సభ్యులు డాక్టర్ చందా సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని రేగుళ్ల గ్రామంలో మండలాధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం 6 గ్యారెంటీ సంక్షేమ పథకాల కరపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సుపరిపాలన లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యురాలు, టీపీసీసీ మెంబర్ సున్నం నాగమణి అన్నారు. మండలపరిధిలోని సత్యంపేట, రామాంజనేయపురం గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ ఎంపీపీ సడియం బక్కులు, అంజుం, ఊకే మోహన్‌రావు, మిరాయాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నివాళి

గుండాల: సీపీఐ నాయకుడు కందిమళ్ల శేఖర్ మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నాయకులు కందిమల్ల శేఖర్ శుక్రవారం మృతి చెందగా ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ మెస్సు కోటేశ్వరరావు, మండల సహాయ కార్యదర్శులు నరెడ్ల రాంబాబు, వజ్జ పగడయ్య, కొమరం హనుమంతరావు, మండల కో ఆప్షన్ సభ్యులు రహీం, నాయకులు పరమ ఇమ్మానుయేలు, రేసు సురేందర్, కందిమళ్ల రవి, సతీష్, శోభన్, వనపర్తి నాని, నరెడ్ల క్రిష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

ట్రైకార్ రుణాలను వినియోగించుకోవాలి


అన్నపురెడ్డిపల్లి: గిరిజనులకు ప్రభుత్వం అందజేస్తున్న ట్రైకార్ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అన్నపూర్ణ కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ట్రైకార్ ద్వారా మంజూరైన 11 యూనిట్లకు ఎంపికైనా లబ్ధిదారుల సర్టిఫికేట్లను అధికారులు పరిశీలించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఆదేశాల ప్రకారం సర్టిఫికేట్లు పరిశీలించామని ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాంభద్రయ్య, బ్యాంకు మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న నిరసనలు..

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు చేస్తున్న నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. వారి దీక్షా శిబిరాలను నాయకులు సందర్శించి మద్దతు తెలిపారు. తక్షణమే డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


అశ్వారావుపేటరూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు


కరకగూడెం: దీక్షలో మధ్యాహ్న భోజన కార్మికులు


దుమ్ముగూడెం: భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భద్రాచలంటౌన్: ప్రజలు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఏఎస్పీ సుచేందర్ అన్నారు. భద్రాచలం హెడ్ పోస్టాఫీస్‌లో ఆవరణలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం డీసీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల వద్దకే పోస్టల్ సేవలు అనే నినాదంతో పోస్టాఫీస్ పని చేస్తుందన్నారు. పోస్టాఫీస్‌లోని పథకాలను ప్రజలకు వివరించి వాటి వల్లన కలిగే ప్రయోజనాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ రామ్మోహన్ రావు, దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు, వెంకటాచారి, ప్రసాద్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత


పనులను పర్యవేక్షిస్తున్న ఉపసర్పంచ్

సాక్షి ఎఫెక్ట్..

దమ్మపేట: 'పామాయిల్ పీచు ట్రాక్టర్ బోల్తా' అను శీర్షికన ఈనెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనానికి దమ్మపేట గ్రామ పంచాయతీ అధికారులు, పాలకవర్గ సభ్యులు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం దమ్మపేట నుంచి మల్లారం వెళ్లే దారిలోని మలుపు వద్ద గల గుంతలను తాత్కాలిక పద్ధతిలో పూడ్పించారు. ఉపసర్పంచ్ దారా యుగంధర్, ఈ గుంతలను పూడ్చే పనులను పర్యవేక్షించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

షెడ్యూల్ విడుదల చేయాలి

భద్రాచలంటౌన్: ప్రధానోపాధ్యాయుల సర్వీస్ నింబధనల సవరణ ఉత్తర్వులను రూపొందించి బదిలీలు, పదోన్నతుల షెడ్యూలును వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజన ఉప ప్రణాళిక ప్రాంతాల్లో గిరిజనులకు వందశాతం ఉద్యోగాల్లో నియామకాలు, పదోన్నతులుపై మెండి వైఖరిని మార్చుకోవాలన్నారు. రామాచారి ఉపాధ్యాయులు ఉల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

ములకలపల్లి: ఎలాంటి అనుమతులేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... లారీల్లో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు స్థానిక మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయం వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అనుమతులు లేకుండా వస్తున్న రెండు ఇసుక లారీలను సీజ్ చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తిరుమలరావు తెలిపారు.

గణేష్ మండపాల్లో అన్నదానం


ములకలపల్లి: అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు


భద్రాచలంటౌన్: అన్నదానం నిర్వహిస్తున్న సభ్యులు

ములకలపల్లి: మండలపరిధిలోని జగన్నాథపురం జీపీలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శుక్రవారం పర్యటించారు. పలుగ్రామాల్లో వినాయక మండపాల్లోని గణనాథుని దర్శించుకుని పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని, పలువురికి స్వయంగా వడ్డించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, సర్పంచ్‌లు గద్దం భవాని, కారం సుధీర్, నాయకులు అడపా నాగేశ్వరావు, తాటి ప్రవీణ్, కర్నాటి రమేశ్ పాల్గొన్నారు
భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని భగవాన్‌దాస్ కాలనీ, సుభాస్ నగర్ కాలనీలలోని గణపతి మండపాల వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాదె మాధవ రెడ్డి, స్వర్ణశ్రీ, రామ్మూర్తి, వెంకటరావు, సీతారాం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం


పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

అశ్వాపురం: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ ముత్తినేని సుజాత అన్నారు. మండల పరిధిలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలలో అశ్వాపురం, మణుగూరు రెండు మండలాల జోనల్ స్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. రెండు మండలాల నుండి 500 మంది క్రీడాకారులు పాల్గొనగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. పీఈటీలు అనిల్‌కుమార్, ఆదినారాయణ, వీరన్న, రాములమ్మ, సునితల ఆధ్వర్యంలో మూడు మండలాల పీఈటీలు క్రీడా పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ యూత్ కో ఆర్డినేటర్ నవీన్‌బాబు క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. క్రీడా పోటీల నిర్వహణకు సహకరించిన దాతలకు పీఈటీలు కృతజ్ఞతలు తెలిపారు.

భద్రాద్రి అభివృద్ధి గాలికే..


నిరసన తెలుపుతున్న నాయకులు

భద్రాచలంఅర్బన్: తొమ్మిదేళ్ల కాలంలో భద్రాచలం అభివృద్ధిని గాలికొదిలేసి కేవలం ఓట్లు కోసమే హడావుడిగా శంకుస్థాపనలు, ఆర్భాటాలు చేస్తున్నారని, ఈ మేరకు నేడు భద్రాచలం పర్యటనకు వస్తున్న రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటనను ప్రజల పక్షాన వ్యతిరేకిస్తున్నట్లు సీపీఐ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రకటించిన రామాలయం అభివృద్ధికి వంద కోట్లు, కరకట్టల నిర్మాణానికి రూ. వెయ్యి కోట్లునిధులు తీసుకురావాలన్నారు. ఎన్నికల వ్యూహాల్లో భాగంగా 520 మీటర్లు కరకట్ట నిర్మాణానికి శంకుస్థాపన హడావిడిగా చేయడం వెనుక అంతర్యం ఏంటని ప్రశ్నించారు. నాయకులు మారెడ్డి శివాజీ, బత్తుల నరసింహులు, ఏసీఎస్ నాయుడు, గుంజ ఏడుకొండలు, గుంజ బాబు, చాడా శోభన్ బాబు, నాని పల్లి శ్రీను, మురాల డానియల్, ప్రదీప్, మారెడ్డి గణేష్ ఉన్నారు.

ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలి

భద్రాచలం పట్టణ ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన హామీలపై కేటీఆర్ సమాధానం చెప్పాలని, వాగ్దానాలు నెరవేర్చని కేటీఆర్‌కు భద్రాచలం వచ్చే అర్హత లేదని సీపీఎం నాయకులు అన్నారు. భద్రాచలం అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా, నాయకులు వెంకటరెడ్డి, నాగరాజు, జ్యోతి, శ్రీనివాస్, సంద్ర భూపేంద్ర, రామకృష్ణ, కాపుల దుర్గారావు, లక్ష్మి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్‌కుమార్ మక్కడ్

మణుగూరు రూరల్ : ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో ఆదివారం హైద్రాబాద్‌లో జరగబోయే జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ముద్రించిన వాల్ పోస్టర్లను ఐలు రాష్ట్ర కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్ శుక్రవారం మణుగూరు కోర్ట్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రెండు సెషన్లుగా జరగబోయే మహాసభకు మణుగూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులందరూ తప్పక హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, న్యాయవాదులు పి.కిషన్‌రావు, నర్సింహరావు, సరస్వతి, శైలజ, విజయలక్ష్మి, సంధ్య, విజయ్‌రావు, లావణ్య, కవిత, శ్రీనివాసరావు, వెంకట్, సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


విశ్వరూప పాదయాత్రను జయప్రదం చేయండి

చంద్రుగొండ: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్‌చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపట్టబోయే విశ్వరూప పాదయాత్రను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 4 నుండి ఈ పాదయాత్ర జోగులాంబ జిల్లా ఆలంపూర్ నుండి ప్రారంభమై, నవంబర్ 5న హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. ఈ పాదయాత్రలో ప్రతీ మండలం నుండి వేలాదిగా మాదిగలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కో ఇన్‌చార్జ్ కొలికపోగు వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆర్డినేటర్ దేవంగి రమణయ్య, అశ్వరావుపేట ఇన్‌చార్జ్ చాపలమడుగు వెంకటేశ్వర్లు, మండలాధ్యక్షుడు నారపోగు మధు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాగర్జనను..


చంద్రుగొండ: ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఆర్యవైశ్య సంఘం గర్జన సభను జయప్రదం చేయాలని ఆర్యవైశ్యగర్జన జిల్లా ఇన్‌చార్జ్ కొదుమూరి దయాకర్‌రావు, మండల నాయకులు చీదళ్ల పవన్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైశ్యులందరూ విధిగా గర్జనసభలో పాల్గొనాల్సిందిగా కోరారు.

శివాలయంలో చండీహోమం


హోమం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో శుక్రవారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి అర్చనలు, ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులు ఆలయంలో పూజలు చేసి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆర్మీకి మణుగూరు యువకుల ఎంపిక


విష్ణువర్ధన్, భానుప్రసాద్

మణుగూరు టౌన్: ఈ నెల 4న ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఆర్మీ ఎంపికలో మణుగూరు పట్టణం బాపనకుంటకు చెందిన దూదిపాళ్ల భానుప్రసాద్, బత్తుల విష్ణువర్ధన్‌లు ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం అర్హత పత్రాలు అందాయని ఒకరికి బెంగళూరులో మరొకరికి నాసిక్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు యువకులు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు.

శాంతి ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

అశ్వాపురం: మండల కేంద్రంలోని జామా మసీదులో శుక్రవారం మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు జెండాలు పట్టుకొని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జామా మసీదు కమిటీ సభ్యులు, మత పెద్దలు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.